


3,600 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లిరూరల్: వర్షాలకు ప్రకాశం బ్యారేజ్ వద్ద ఐదు గేట్లు ఎత్తి దిగువకు 3600 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు.



నేడు 'సంకట హర' హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో సోమవారం సంకట హర గణపతి హోమం చేయనున్నారు.



నిత్యాన్నదానానికి విరాళాలు

మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి రేపల్లె వాస్తవ్యుడు డాక్టర్ వసంతం వీరరాఘవయ్య రూ.1,00,116 విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్

'పది' విద్యార్థులకు రూ.లక్ష ఆర్థికసాయం

జిల్లా కలెక్టర్‌కు చెక్కు అందజేసిన రిటైర్డు ఐఎఫ్‌ఎస్ అధికారి



నరసరావుపేట: పల్నాడు జిల్లాలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రిటైర్డు ఐఎఫ్‌ఎస్ అధికారి జూపూడిప్రసాద్ రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను తన కుటుంబ సభ్యులతో కలిసి చెక్కును అందజేశారు. నవోదయంలో విద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, యువ సాధికారిత కార్యక్రమాలను రూపొందించి, అందుకు అనుగుణంగా ఆయా సామాజికవర్గాల అభ్యున్నతికి కలెక్టర్ చేస్తున్న కృషిని ప్రసాద్ కొనియాడారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం మరి కొంత మంది సహకారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కలెక్టర్ వారిని అభినందించారు.

జూన్ 1 నుంచి మహా కుంభాభిషేకం



పెదకాకాని: శివాలయంలో జూన్ 1వ తేదీ నుంచి 3 వరకు మూడు రోజుల పాటు మహా కుంభాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు డీసీ ఈమని చంద్రశేఖర రెడ్డి తెలిపారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పీఠాధిపతులు, అర్చకస్వాముల పర్యవేక్షణలో నిర్వహించనున్న మహా కుంభాభిషేకం ఏర్పాట్లను ఆదివారం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను కలసి వివరించడం జరిగింది. మంత్రి సత్యనారాయణ దంపతులకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి చిత్రపటం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో మహా కుంభాభిషేకం క్రతువుకు సంబంధించిన పనులు చేపట్టినట్లు వివరించారు. మంత్రిని కలసిన వారిలో శివాలయం సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు, అర్చకులు ఉన్నారు.

నీట్ పరీక్షకు 565 మంది హాజరు



వేటపాలెం: స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ (యూజీ)–2023 పరీక్షలకు 565 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలరావు ఆదివారం తెలిపారు. పరీక్షలకు 576 మంది హాజరు కావాల్సి ఉండగా 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులకు కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్షల కో–ఆర్డినేటర్‌గా అలీ సాహెబ్, రాధాకుమారి, బీవీ రాఘవయ్య వ్యవహరించారు.

రీ–కౌంటింగ్‌కు 13 వరకు గడువు

గుంటూరుఎడ్యుకేషన్: పదో తరగతి జవాబు పత్రాల రీ–కౌంటింగ్, రీ–వెరిఫికేషన్ కోసం ఈనెల 13లోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదివారం ఓప్రకటనలో పేర్కొన్నారు. రీ–కౌంటింగ్ కోసం సబ్జెక్టుకు రూ.500, జవాబు పత్రాల ఫొటో కాపీతో కూడిన రీ–వెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున www.cfms.gov.in సిటిజన్ చలాన్ ద్వారా రుసుము చెల్లించాలని సూచించారు. చలానా రుసుము చెల్లించిన అనంతరం www.bse.ap.gov.in సైట్‌లో అందుబాటులో ఉన్న దరఖాస్తు ఫారాన్ని పూరించి, ప్రింట్ తీసుకొని సంబంధిత పాఠశాల హెచ్‌ఎం సంతకంతో హాల్ టికెట్ ఫొటో కాపీ జత చేసి గుంటూరు స్టాల్ బాలికోన్నత పాఠశాలలోని కౌంటర్‌లో అందజేయాలని తెలిపారు. రీ–వెరిఫికేషన్, ఫొటో కాపీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రీకౌంటింగ్ కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. కేవలం చలానా రూపంలోనే ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని స్పష్టం చేశారు. సప్లిమెంటరీ పరీక్షల కోసం విద్యార్థులు ఈనెల 17 నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పటిష్ట చర్యలతో భవిత పదిలం

పది పరీక్ష ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు

- ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధకు అందిన ఫలితం
- ఉత్తమ ఫలితాలతో మెరిసిన విద్యార్థులు



జె.పంగులూరు మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

బాపట్ల అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన విద్యాకానుకతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రత్నాల్లా మెరిశారు. ఈనెల 6న ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. అమ్మఒడి తోడుగా చదువులమ్మ చెట్టు నీడన విద్యా కుసుమాలై వికసించారు. అత్యుత్తమ ఉత్తీర్ణతతో ప్రభుత్వ విద్యా ప్రమాణాల విలువలను చాటి చెప్పారు.

బాపట్ల జిల్లా 75.31 శాతం ఉత్తీర్ణత..

రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాపట్ల జిల్లా 75.31 శాతం ఉత్తీర్ణత సాధించింది. జిల్లావ్యాప్తంగా 16,621 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా, 12,517 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురలో ఉత్తీర్ణత సాధించిన 6,116 మంది, బాలికల్లో 6,401 మంది నమోదయ్యారు. మొత్తం బాలుర ఉత్తీర్ణత శాతం 72.18, బాలికల ఉత్తీర్ణత శాతం 78.56 శాతం సాధించారు.

విద్యాభివృద్ధికి చర్యలు...

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంది. అమ్మ ఒడితో పిల్లలను చదువులమ్మ గుడిలోకి ఆహ్వానించింది. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. విద్యా కానుక అందించి ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించేందుకు చర్యలు చేపట్టింది. అదే సమయంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి విద్యార్థుల స్థాయిని గుర్తించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఈ చర్యలన్నీ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాన్నిచ్చాయి.

నూరుశాతం ఉత్తీర్ణత..

బాపట్ల జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఆయా పాఠశాలలో ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలకు తోడు ప్రభుత్వం అందించిన చేయూత వారి విజయాల్లో కీలకంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. జిల్లాలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల్లో ప్రధానంగా రేపల్లె మండలం దిబ్బ జెడ్పీహెచ్‌ఎస్ 23 మందికి 23 మంది విద్యార్థులు పాసయ్యారు. నగరం మండలంలోని అద్దంకివారిపాలెం పాఠశాలలో 8, బాపట్ల మండలంలోని బాపట్ల డెఫ్ అండ్ డెమ్ పాఠశాల్లో 18, అద్దంకి మండలంలోని ధర్మవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో 23, మార్టూరు మండలంలోని దర్శి జెడ్పీహెచ్‌ఎస్ 19 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.



బి.అక్షిత (590)



పి.పల్లవి (582)

మట్టిలో మాణిక్యం ..

జె.పంగులూరు మండలం అలవలపాడు గ్రామానికి చెందిన గొట్టిపాటి సురేష్ బాబు, శ్రీదేవిల కుమార్తె సృజన 591 మార్కులతో సత్తా చాటింది. సురేష్ వ్యవసాయం చేస్తుంటాడు. భూమాతను నమ్ముకున్న సురేష్‌కు తన కుమార్తె మట్టిలో మాణిక్యమని చెబుతున్నాడు. ఇంజినీర్ అవ్వాలనేదే తన కోరికని ఈ సందర్భంగా సృజన చెప్పింది.



గొట్టిపాటి సృజన (591)

ఏరోనాటికల్ ఇంజినీరింగే లక్ష్యం..

ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో టాప్ లేపారనే చెప్పాలి. దంతం విష్ణుప్రియ 591 మార్కులతో జిల్లాలోనే మొదటి స్థానం సాధించింది. వేటపాలెం మండలంలోని రామన్నపేటకు చెందిన భద్రయ్య, హేమావతిల కుమార్తె విష్ణుప్రియ మొదటి నుంచి చదువులో ముందంజలో ఉండేది. భద్రయ్య మగ్గం వర్క్ చేస్తూ కుమార్తెను చదివిస్తున్నాడు. తనకు ఏరోనాటికల్ ఇంజినీర్ అవ్వాలని ఉందని, దీని కోసం ఎంతైనా కష్టపడతానని విష్ణుప్రియ తెలిపింది.



దంతం విష్ణుప్రియ (591)

సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ చేస్తా..

జె.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన పోలిశెట్టి వంశీకృష్ణ, అంజలిల కుమార్తె సుప్రజ చదువుల తల్లిగా పేరు తెచ్చుకుంది. తండ్రి మెడికల్ దుకాణం నిర్వహిస్తుంటాడు. పదో తరగతి ఫలితాల్లో పోలిశెట్టి సుప్రజ 593 మార్కులు సాధించింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయి, మంచిఉద్యోగం సాధించడమే నా కల అని సుప్రజ వెల్లడించింది.



పోలిశెట్టి సుప్రజ (593)

ఐఐటీ లక్ష్యం..

రేపల్లె మండలం పేటేరు గ్రామానికి చెందిన జక్కా నూకరాజు, ప్రభావతిల కుమారుడు యశ్వంత్ కుమార్ పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపి, 591 మార్కులు సాధించాడు. నూకరాజు ఆర్టీసీ కండక్టర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఐఐటీ చదవి, ఇంజినీరింగ్ చేయడమే లక్ష్యమని యశ్వంత్ కుమార్ చెబుతున్నాడు.



యశ్వంత్ కుమార్ (591)

సాక్షి నెట్‌వర్క్: వేటపాలెం మండలం పందిళ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పి.పల్లవి 582 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచింది. పి.కార్తిక్ సాయి మోహన్ 580 మార్కులతో మూడో స్థానంలో నిలిచారు.



మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణలో మంత్రి డాక్టర్ నాగార్జున, ఎమ్మెల్యే శివకుమార్, నూకల వేణు

అజాత శత్రువు కొణిజేటి రోశయ్య

కాంస్య విగ్రహావిష్కరణలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున

తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్ర గవర్నరుగా పనిచేసిన ప్రముఖ రాజకీయనేత, దివంగత కొణిజేటి రోశయ్య, రాష్ట్ర రాజకీయాల్లో అజాత శత్రువని, మహానాయకుడిగా పేరు తెచ్చుకున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. పట్టణ బోసు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఉదయం రోశయ్య కుమారుడు కొణిజేటి శివసుబ్బారావు, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. రోశయ్య విగ్రహానికి అభిషేకాలు చేశారు. మంత్రి డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ, తెనాలి నుంచి రాజకీయాలు నేర్చుకుని, దేశరాజకీయాల్లో పెట్టనికోటలా ఎదిగిన రోశయ్య రాజకీయ జీవితం ప్రతి వారికి స్ఫూర్తిదాయకంగా చెప్పారు. తరతరాలు గుర్తుంచుకునే వ్యక్తిత్వం కలిగిన రోశయ్య మార్గంలో పేద ప్రజలకు అండగా ప్రభుత్వ పథకాలను అందించటం, కనీసం ఎవరికీ అన్యాయం చేయకూడదనే ఆలోచనను పాటిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, వివిధ మంత్రిత్వశాఖలు, రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నరుతో సహా పలు ఉన్నత పదవులు చేపట్టిన రోశయ్యపై గల అభిమానంతో ఆయన విగ్రహం ఏర్పాటు చేసుకుని, రోశయ్య మార్గ్‌గా నామకరణం చేసినట్టు చెప్పారు. రోశయ్య రాజకీయ జీవితం నేటితరానికి, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయంగా ఉండాలనేది తమ ఆశయన్నారు. ఎన్నో పదవులు నిర్వహించినా, ఎక్కడా అవినీతి, ఆశ్రిత పక్షపాతం లేకుండా అజాత శత్రువుగా రోశయ్య కొనసాగారని గుర్తుచేశారు. రోశయ్య కుమారుడు కొణిజేటి శివసుబ్బారావు, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం సత్రం కమిటీ అధ్యక్షుడు, విగ్రహ మండప దాత నూకల వెంకట వేణుగోపాలరావు శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి మాట్లాడారు. విగ్రహ దాత, ప్రముఖ వ్యాపారవేత్త నంబూరు వెంకట కృష్ణమూర్తి, డబుల్‌హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల మోహన్ శ్యాంప్రసాద్, శశి గ్రూప్స్ అధినేత వుప్పల వరదరాజులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సాధు ప్రతాప్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, కాంగ్రెస్ నేతలు డాక్టర్ చందు సాంబశివుడు, పొన్నూరు నాగసూర్య శశిధరరావు, బీజేపీ నేతలు చెరువు రామకోటయ్య, పాటిబండ్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, మన్నవ ప్రభాకర్, రెడ్డి రమణమ్మ పాల్గొన్నారు. విగ్రహ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావును సత్కరించారు. అనంతరం మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, నక్కా ఆనంద్‌బాబు రోశయ్య విగ్రహానికి నివాళులర్పించారు.

రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటాం

మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్

గుంటూరు వెస్ట్: అకాల వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులు దిగులు పడొద్దని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జిల్లా అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు, రబీలో చేస్తున్న పంటలకు ప్రభుత్వం బీమా పథకం అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక ఉత్తర్వుల ప్రకారం క్రాప్ ఇన్సూరెన్స్ కూడా వర్తిస్తుందని చెప్పారు. పంట నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందిస్తుందన్నారు. విత్తనం నాటిన నుంచి పంట చేతికొచ్చేవరకు రైతు పడే కష్టం ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. ఇప్పటికే 170 రైతు భరోసా కేంద్రాల ద్వారా మొక్క జొన్న కొనుగోళ్లు ప్రారంభించారన్నారు. వర్షాలు తగ్గగానే క్షేత్ర స్థాయిలో తిరిగి పంట నష్టం అంచనాలు వేస్తామని చెప్పారు. ప్రజా, రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా ఆదుకుంటారని హామీ ఇచ్చారు.

ప్రత్యేక బృందాలను నియమించాం: కలెక్టర్

సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పంట నష్టాన్ని ప్రాథమికంగా కొంత అంచనా వేశామన్నారు. గత ఏడాది ఇదే నెలలో 10 మి.మీ వర్షపాతం నమోదుకాగా ఈ ఏడాది ఇదే నెలలో 100 మి.మీ వర్షపాతం నమోదయ్యిందన్నారు. పంట నష్టం ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో మొక్క జొన్న 3185 హెక్టార్లు, జొన్న, వరి స్వల్పంగా నష్టం జరిగినట్లు తెలిసిందన్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుజాత, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ నిర్మల, సివిల్ సప్లయిస్ డీఎం లక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్ర ర్యాలీలో పాల్గొన్న భక్తులు

వినుకొండ(నూజెండ్ల): హనుమాన్ జన్మోత్సవాల్లో భాగంగా వినుకొండ విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. శోభాయాత్రకు ప్రజల నుంచి విశేషస్పందన లభించింది. గుంటి ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో స్వామివారికి హిమాలయ గురూజీ ప్రత్యేక పూజలు నిర్వహించి జెండాను ఊపి శోభాయాత్ర బైక్‌ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ వెల్లటూరు రోడ్డు మీదుగా కారంపూడి రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, శివయ్యస్థూపం, నరసరావుపేట రోడ్డు, సురేష్‌మహల్, లాయర్‌స్ట్రీట్, రంగనాయకస్వామి గుడి, మెయిన్‌బజారు, బోసుబొమ్మ సెంటర్, కోదండ రామాలయం మీదుగా తిరిగి గుంటి ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్దకు చేరింది. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున హనుమాన్ జెండాలతో అలంకరించబడిన బుల్లెట్, తదితర ద్విచక్రవాహనాలపై పెద్దలు, యువకులు, స్త్రీలు, పిల్లలు, హనుమాన్ భక్తుల జైశ్రీరామ్– జై హనుమాన్ – భారత్ మాతాకీ జై నినాదాలతో పట్టణం మొత్తం మార్మోగింది. వీధులన్నీ కాషాయ జెండాలతో నిండిపోగా హనుమాన్ రథం, డీజేలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం అన్నా రామకోటయ్య కుమారుల వితరణతో అన్నప్రసాదం అందించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, విశ్వహిందూ పరిషత్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు భాగవతుల రవికుమార్, గజవల్లి నాగపవన్‌కుమార్, కొత్త రామకృష్ణ, పెండేల పుల్లారావు, మాల్యాద్రి, అన్నా మణికంఠ, ఇమ్మడిశెట్టి మల్లికార్జున, కొత్తమాసు రవి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు సత్వరం అందజేయాలి

పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్



కలెక్టరేట్‌లో టిడ్కో గృహాలపై సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, డీఆర్‌ఓ వినాయకం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ప్రభుత్వ సహకారంతో పేద, మధ్య తరగతి వర్గాలకు నిర్మిస్తున్న టిడ్కో గృహాల్లో ఇప్పటివరకు పూర్తి చేసిన వాటిని త్వరితంగా లబ్ధిదారులకు అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు.

ఆదివారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో టిడ్కో గృహ నిర్మాణ శాఖ అధికారులు, రెవెన్యూ డివిజన్ల అధికారులు, జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లతో సమీక్షించారు. నిర్మాణ పనుల్లో తలెత్తుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. చిలకలూరిపేట నియోజకవర్గం పరిధిలో ఫేజ్–1 ద్వారా చేపట్టిన టిడ్కో గృహాలలో 4512 నిర్మాణాలు పూర్తి కావాల్సిఉండగా, ఇప్పటికే నాలుగు వేల మంది లబ్ధిదారులకు గృహాలను అందజేయడం జరిగిందని వివరించారు. మరో 512 గృహాల నిర్మాణం వేగవంతంగా కొనసాగుతుందన్నారు. నరసరావుపేట పట్టణ పరిధిలో 1504 గృహ నిర్మాణాల పనులను ఈనెల 15 నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. మాచర్ల పట్టణంలో 1057 ఇళ్లకుగాను 984 గృహ నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. పిడుగురాళ్ల పట్టణ పరిధిలో 2832 గృహాలకుగాను 1296 తొలి దశలో సిద్ధం చేస్తున్నామన్నారు. సత్తెనపల్లి పట్టణంలో సుమారు 160 గృహాల నిర్మాణపనులు కొనసాగనున్నాయన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాలు కొనసాగుతున్న ప్రాంతాల్లో నిధులు, ఏజెన్సీలు పరిస్థితులను బట్టి త్వరితగతిన పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్లతో సమస్యలు ఉన్నచోట స్థానిక ప్రజా ప్రతినిధులు, శాసనసభ్యులతో చర్చించి పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక నుంచి రెగ్యులర్‌గా టిడ్కో గృహాల నిర్మాణాలు పూర్తయ్యే వరకు, నిరంతర పర్యవేక్షణ ఉంచాలని సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అధికారులతో గృహ నిర్మాణాల పరిస్థితిపై దిశా నిర్దేశం చేశారు. సమీక్ష సమావేశంలో మూడు జిల్లాల టిడ్కో గృహ నిర్మాణ శాఖ ఈఈ ఏరా ప్రసాదరావు, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, పల్నాడు జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ సీఈ పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానంపై ఉక్కుపాదం

- జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక డ్రైవ్
- మందుబాబులకు పోలీసుల కౌన్సెలింగ్
- 820 మందిపై 758 కేసులు నమోదు



బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు (ఫైల్)

నగరంపాలెం(గుంటూరు ఈస్ట్): జిల్లావ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే మందుబాబులను కట్టడి చేసేందుకు జిల్లా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. గత పది రోజులుగా నిర్వహిస్తున్న ఈ డ్రైవ్‌లో ఎవరైనా జన సంచారంతో రద్దీగా ఉండే కూడళ్లల్లో మద్యం సేవిస్తూ కనిపిస్తే కౌన్సెలింగ్ చేపడుతున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ వెళ్తే జరిగే ప్రమాదాల వల్ల కలిగే ప్రాణపాయం, కుటుంబ /ఆర్థిక పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నారు.

గతనెలలో 'సమీక్ష'..

గతనెల 29న నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం జరిగింది. గుంటూరు రేంజ్ ఐజీ డి.పాలరాజు హాజరవ్వగా, జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అధ్యక్షత వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంకెన్ డ్రైవ్) వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని ఐజీ తెలియజేశారు. ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. దీనిలో భాగంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ మొదలైంది.

జిల్లా అంతటా..

గుంటూరు నగరంలోని ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రధాన కూడళ్లల్లో బహిరంగంగా మద్యం తాగే మందుబాబులను గుర్తిస్తున్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలకు అనుకుని ఉన్న ఖాళీ ప్రదేశాల్లోనూ, రహదారుల వెంట వాహనాలను నిలుపుదల చేసి మద్యం తాగేవారికి ముందుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. స్వామి థియేటర్ సెంటర్, గుజ్జనగుండ్ల, నాజ్‌సెంటర్, అరండల్ పేట, లాలాపేట, పాతగుంటూరు ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాల్లోనూ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. జిల్లాలోని మండల, గ్రామాల్లోనూ ఈ డ్రైవ్ కొనసాగుతుంది.

ప్రమాదాలపై అవగాహన...

ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్‌ఐ, ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు కానిస్టేబుళ్లు ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే మందుబాబులను గుర్తించి, వారి పేరు, వృత్తి, నివాస వివరాలను వాకబు చేస్తున్నారు. అనంతరం వారికి మద్యం మత్తులో వాహనాలు నడిపే క్రమంలో.. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే తలెత్తే పరిణామాలపై కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

మద్యం మత్తులో ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టిన వాహనదారునితోపాటు అవతలి వ్యక్తులకు గాయాలైనా, ప్రాణపాయం వాటిల్లినా.. ఇరువురి కుటుంబాల్లోనూ తీవ్ర విషాదం నెలకొంటుందని చెబుతున్నారు. ఇక ప్రమాదాలు జరిగి, ఎవరైనా ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబ సభ్యులు రోడ్డునపడతారని, కుటుంబ పోషణ కష్టంగా మారుతుందని, కుటుంబ ఆర్థిక, పిల్లల విద్య పరిస్థితులు తారుమారవుతాయని హెచ్చరిస్తున్నారు. ఒకసారి కౌన్సెలింగ్ జరిగి, మళ్లీ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ కనిపిస్తే కేసులు నమోదు చేస్తున్నారు.

పది రోజుల్లో 758 కేసులు..

గత పదిరోజుల్లో జిల్లావ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే 820 మంది మందుబాబులపై 758 కేసులు నమోదు చేశారు. బహిరంగంగా మద్యం సేవించే వారిపై టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం, ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

క్లుప్తంగా

నేడు ఉప్పుమాగులూరులో మంత్రి, ఎంపీ పర్యటన

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ, ప్రహరీ, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ పీ.మహాలక్ష్మమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు కల్లి అంజనీ ప్రసాదరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాల్లో బాపట్ల ఎంపీ నందిగం సురేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బీసీహెచ్ గరటయ్య, జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమాల్లో గ్రామాల వారీగా ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నాలని కోరారు.

మణిపూర్‌లో వేటపాలెం కుటుంబం క్షేమం

వేటపాలెం: మణిపూర్‌లో జరుగుతున్న ఘర్షణల్లో వేటపాలేనికి చెందిన కుటుంబం క్షేమంగా ఉన్నట్లు వారి కుటుంబ సభ్యులకు ఆదివారం సమాచారం అందించారు. మణిపూర్‌లో రెండు మతాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు జరుగుతున్న ఘర్షణలో అనేక మంది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు తెలిసిందే. వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ రావూరిపేటకు చెందిన యారాసు మోహన్‌రావు మణిపూర్‌లో ప్రైవేట్ ఫ్యాక్టరీలో ఇంజినీరింగ్ పనిచేస్తున్నాడు. వారి కుటుంబం మణిపూర్‌లోని ఇంఫాల్‌లో నివాసం ఉంటున్నారు. అక్కడ జరుగుతున్న అల్లర్లలో వీరికి కంపెనీ తరఫున ప్రభుత్వం ప్రత్యేక భద్రత కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య ఆదివారం తెలిపారు. స్టూవర్టుపురం–బాపట్ల రైల్వేస్టేషన్ల మధ్యగల అప్‌లైన్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించినట్లు ఎస్సై చెప్పారు. మృతుని వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, రైలు వచ్చే పరిస్థితిని గమనించకుండా రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొట్టి ఉంటుందని ఎస్సై తెలిపారు. రైలు ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే వ్యక్తి మృతి చెందినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారమే లోక్‌అదాలత్ ధ్యేయం

- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్
- 13న జాతీయ లోక్‌అదాలత్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారమే లోక్ అదాలత్ ధ్యేయమని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈనెల 13న జాతీయ మెగాలోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సివిల్, కొన్ని క్రిమినల్, భార్యాభర్తల మధ్య వివాదాలు కోర్టుల్లో ఉన్న కేసుల్లో ఉభయ పక్షాల వారికి ఆమోదయోగ్యమైన పరిష్కారాలను జాతీయ లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చునన్నారు.

సీఎం కప్ పోటీలలో చీరాల క్రీడాకారుల ప్రతిభ

- వెయిట్ లిఫ్టింగ్ 73 కేజీల విభాగంలో ప్రేమసాగర్‌కు సిల్వర్ మెడల్
- 89 కేజీల విభాగంలో రవితేజకు బ్రాంజ్ మెడల్


క్రీడాకారులను అభినందిస్తున్న ఉమ్మడి ప్రకాశం జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల రూరల్: ఏపీ సీఎం వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చీరాల క్రీడాకారులు తమ ప్రతిభ చాటారు. ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ నుంచి చీరాల క్రీడాకారులు పాల్గొన్నారు. చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీకి చెందిన దేవరకొండ ప్రేమ్‌సాగర్ 73 కేజీల విభాగంలో పోటీపడి ఓవరాల్‌గా 232 కేజీల బరువులు ఎత్తి సిల్వర్ మెడల్ సాధించాడు. మరో చీరాల క్రీడాకారుడు టీ రవితేజ 89 కేజీల విభాగంలో పోటీపడి ఓవరాల్‌గా 195 కేజీల బరువులు ఎత్తి బ్రాంజ్ మెడల్ సాధించాడు. పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ పున్నారావు, టీమ్ మేనేజర్ డి.ప్రవీణ్‌కుమార్, రిటైర్డు డీఎస్‌డీవో శ్రీనివాస్‌ప్రసాద్‌లు అభినందించారు. వీరు ఇంకా అనేక పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ఫలితాలు సాధించి దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జిల్లాస్థాయి చెస్ పోటీల ఎంపికలు


చెస్ పోటీల విజేతలతో నరేష్, జి.రాజేంద్రప్రసాద్ తదితరులు

బాపట్లఅర్బన్: బాపట్ల జిల్లా అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో శిఖరం వారి స్ట్రీట్‌లో ఆదివారం యుక్మాస్ విద్యాసంస్థలోని అబాకస్ క్యాంపస్‌లో జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. సీనియర్ బాలుర కేటగిరిలో మొదటి నాలుగు స్థానాలు తాళ్ల నిచ్చల్, సురా విజయబాబు, సంతోష్, వెంకట సుబ్బారావులు సాధించారు. వీరు బాపట్ల జిల్లా నుంచి ఈనెల 26న తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో తలపడనున్నారు. సీనియర్ బాలికల కేటగిరిలో మొదట నాలుగు స్థానాలు వి.దీప్తి, ఎం.నీలిమ, వి.శ్రీహిత రెడ్డి, కె.అక్షర సాధించారు. వీరు బాపట్ల జిల్లా నుంచ ఈనెల 16న విజయవాడలో జరుగునున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారు. బాపట్ల జిల్లా చెస్ కమిటీ కో కన్వీనర్ తాళ్ల నరేష్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. యుక్మాస్ విద్యాసంస్థల అధినేత గొనిగల రాజేంద్రప్రసాద్, జొన్నకూటి వెంకటేశ్వరరావు విజేతలకు బహుమతులు అందజేశారు.

పుట్టింటికి వస్తుండగా కారు ఢీకొని మహిళ మృతి

బల్లికురవ: పుట్టింటికి వస్తూ బస్సుదిగి రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న కారు ఢీకొట్టటంతో ఓ మహిళ అక్కడిక్కడే దుర్మణం పాలైయింది. ఈ ఘటన ఆదివారం రాత్రి మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన రావులపల్లి పెద వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, అంజయ్యల సోదరి ఆదెమ్మ (55)ను దర్శి మండలం చెర్వుకొమ్మువారిపాలెం గ్రామానికి చెందిన తేలుకొట్ల గంగయ్యకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు మగపిల్లలు, తొమ్మిది నెలల క్రితం భర్త గంగయ్య అనారోగ్యంతో చనిపోయాడు. పుట్టింటికి వచ్చేందుకు బస్సుదిగి గ్రామంలోకి వస్తుండగా హైద్రాబాద్ నుంచి ఒంగోలు వెళ్తున్న కారు వేగంగా వస్తూ ఆదెమ్మను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల పూర్తిగా ఛిద్రమై అక్కడిక్కడే చనిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు

పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్


వాడరేవులో స్నానాలు చేస్తున్న పర్యాటకులు


అలల తాకిడికి గురైన రాజావలిని ప్రాణాలతో కాపాడిన మెరైన్ పోలీసులు

చీరాల టౌన్: అలల తాకిడికి గురై సముద్రంలో కొట్టుకుపోతున్న ఒక యువకుడిని మెరైన్ పోలీసులు ప్రాణాలతో కాపాడిన ఘటన ఆదివారం వాడరేవు గ్రామంలో చోటుచేసుకుంది. మెరైన్ సీఐ కే శ్రీనివాసరావు, ఎస్ఐ పసుపులేటి సుబ్బారావు అందించిన వివరాల మేరకు.. ఆదివారం వాడరేవు సముద్ర తీరం పర్యాటకులతో నిండిపోయింది. వేసవి సెలవులు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు తమ వాహనాల్లో వాడరేవుకు చేరుకుని సముద్రంలో స్నానాలు ఆచరిస్తున్నారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం నాగవరానికి చెందిన 50 మంది బృందం వాడరేవు స్నానానికి వచ్చారు. వీరిలో సయ్యద్ రాజావలి సముద్రంలో అలల తాకిడికి గురై కొట్టుకుపోతుండగా కానిస్టేబుల్ నరేష్‌బాబు, హోంగార్డు శ్రీనివాసరావులు గమనించి అలల తాకిడిగురైన రాజావలిని తమ ప్రాణాలను లెక్కచేయకుండా కాపాడి ఒడ్డుకు చేర్చారు. సకాలంలో స్పందించి యువకుడి ప్రాణాలను కాపాడిన మెరైన్ పోలీసులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు. సముద్ర తీర ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు సముద్రంలో లోతుకు వెళ్లకుండా స్నానాలు ఆచరించాలని, గుంతలు లేని ప్రదేశంలోనే స్నానాలు చేయాలన్నారు. మెరైన్, సివిల్ పోలీసుల హెచ్చరికలను పర్యాటకులు పాటిస్తే ప్రాణాలకు ముప్పు ఉండదని పోలీసులు పర్యాటకులకు సూచించారు. వాడరేవు నుంచి రామాపురం, కఠారిపాలెం వరకు మెరైన్, సివిల్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శశికిరణ్

చీరాల రూరల్: భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చీరాల కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్న బూదరాజు శశికిరణ్ ఎంపికయ్యారు. భారత న్యాయవాదుల సంఘం 11వ రాష్ట్ర మహాసభలు ఆదివారం రాజమండ్రిలోని హోటల్ రివేరాలో జరిగాయి. మహాసభలకు ముఖ్య అతిథులుగా ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ. శేష సాయి, జస్టిస్ మానవేంద్రరాయ్‌లు హాజరైనట్లు శశికిరణ్ తెలిపారు. 13 జ్యుడీషియరి జిల్లాల నుంచి 800 మంది ప్రతినిధులు సభకు హాజరయ్యారని, అందరి సమక్షంలో నూతన కమిటీ ఎంపిక చేశారన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికైన న్యాయవాది శశికిరణ్‌కు పలువురు న్యాయవాదులు, తోటి సహచరులు అభినందనలు తెలియజేశారు. తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి సంఘానికి మంచి గుర్తింపు తీసుకువస్తానని శశికిరణ్ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు



వినుకొండ(నూజెండ్ల): పిచ్చికుక్క ఐదుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన నూజెండ్ల మండలం అప్పాపురంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు.. అప్పాపురం ఎస్సీ కాలనీలో దాసరి కోటేశ్వరమ్మ, గరిగల ఏసమ్మ, నాగమ్మలతో పాటు మరో ఇద్దరిపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో కోత దశలో ఉన్న వరి, మొక్కజొన్న పంటలకు కొంతమేర నష్టం వాటిల్లిందని, అయితే రైతులెవరూ దిగాలు చెందాల్సిన అవసరం లేదని, నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 58,810 హెక్టార్లు కాగా, 58,872 హెక్టార్లలో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేశారన్నారు. ఇందులో ముఖ్యంగా వరి 19,078హెక్టార్లు, మొక్కజొన్న 13,679 హెక్టార్లు, పప్పు ధాన్యాలు 9,984 హెక్టార్లు ఉన్నాయన్నారు. వర్షాలకు దెబ్బతిన్నపంటలను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన అవసరంలేదని, విస్తీర్ణంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయటం జరుగుతుందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెట్టుబడి రాయితీ, పంట బీమా పరిహారం అందజేస్తుందన్నారు. వర్షానికి పాడైన వరి, మొక్కజొన్నలను కొన్ని జాగ్రత్తలు తీసుకొని రక్షించుకోవచ్చన్నారు. రైతులు వదంతులు నమ్మకుండా ఆర్‌బీకేల ద్వారా మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ధాన్యం విక్రయించుకునేందుకు పంట నమోదై ఉంటేచాలన్నారు. ఈనెల 9వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉన్నందున పంట నష్ట వివరాలను అధికారులు సేకరించి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటారని వివరించారు. ఏ సీజన్‌లో జరిగిన నష్టాన్ని ఆ సీజన్‌లోనే పరిహారాన్ని ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. అత్యవసరం సాయం కోసం కంట్రోల్ రూమ్ నంబరు 88977 98430 సంప్రదించాలని సూచించారు.

జేఎన్‌టీయూ–ఎన్ కళాశాలకు ఉజ్వల భవిష్యత్

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి


మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

నరసరావుపేట ఈస్ట్: జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాలకు ఉజ్వల భవిష్యత్ ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. కళాశాలలో శనివారం రాత్రి నిర్వహించిన 7వ వార్షికోత్సవంలో ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాల శాశ్వత భవనాల నిర్మాణం మరో నాలుగు నెలల్లో పూర్తి చేసుకొని పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఎనిమిదేళ్లుగా అద్దె భవనాలలో నడిచిన కళాశాల తన సొంత భవనాలలోని మారటం అభినందనీయమని చెప్పారు. కళాశాల విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలలో అత్యధిక ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించటంపై హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపకుల అంకిత భావం, విద్యార్థుల క్రమశిక్షణతోనే ఇది సాధ్యపడుతుందని తెలిపారు. విద్య, క్రీడా, సాంస్కృతిక రంగాలలో బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూకే పాలక మండలి సభ్యులు మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, నాగార్జున విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.జాన్సన్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్ బాబు, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ జీపీ రాజు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వైభవంగా రంగనాథుని పుష్పయాగం


పుష్పయాగంలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడు

యద్దపాడు: కొలిచిన వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతోన్న రంగనాథుని దివ్య బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మండలంలోని సొలసలోని శ్రీభూసమేత రంగానాయక స్వామి దేవస్థానంలో ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగిన ఆయా ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆద్యంతం భక్తిభావంతో జరిగాయి. బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులకు శ్రీదేవి, భూదేవి, రంగనాయకస్వామి నూతన వధూవరులుగా అలంకృతులై దర్శనమిచ్చారు. కల్యాణోత్సవాలను కమనీయంగా నిర్వహించారు. చివరి రోజు కార్యక్రమాలు పూలంగిసేవ, ద్వాదశ ప్రదక్షణలు, రంగనాథుని పవళింపు సేవా కార్యక్రమాలు నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ అర్చకులు పర్చూరి రామకృష్ణామాచార్యులు పుష్పయాగాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం భక్తులు ప్రసాద వితరణ చేశారు. ఆలయ ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి, అర్వపల్లి సాంబశివరావు, కామేశ్వరీదేవి, అర్వపల్లి వెంకటస్వామి, వెంకట రాజరాజేశ్వరీ దంపతులు, అర్వపల్లి శాయిశ్రీమేఘన పాల్గొన్నారు. ఏర్పాట్లను ఈఓ సీహెచ్ శివయ్య పర్యవేక్షించారు.

50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు

కొరిటెపాడు(గుంటూరు): పచ్చిరొట్ట ఎరువులకు(గ్రీన్‌మెన్యూర్స్) ఉపయోగపడే జీలుగ(ధనించా) విత్తనాలు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జి.సుబ్బయ్య తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. క్వింటా జీలుగ విత్తనాలు పూర్తి ధర రూ.7,900 కాగా అందులో రైతులు తమ వాటా కింద 50 శాతం రూ.3,950 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 10 కిలోల బస్తా రూపంలో వచ్చే జీలుగ విత్తనాలు భూమి విస్తీర్ణాన్ని బట్టి గరిష్టంగా ఒక్కో రైతుకు ఐదు బస్తాలు వరకు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే జనుము క్వింటా రూ.8,400 కాగా రైతు వాటా రూ.4,200 గానూ, పిల్లిపెసర పూర్తి ధర రూ.9,700 కాగా అందులో రూ.4,850 ఖరారు చేశారన్నారు. ఒక్కో రైతుకు గరిష్టంగా ఐదు ప్యాకెట్లు ఇస్తామని తెలిపారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ వాటా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుంటే సకాలంలో అందుబాటులోకి తెస్తామని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాల ద్వారా పంటలకు మేలు జరిగేలా భూమిలో సేంద్రీయ పోషకాలు బాగా అభివృద్ధి చెందుతాయని ఆయన తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యులు మెలకువలు పాటించాలి

- శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు
- డీఎంహెచ్ఓ జి.శోభారాణి


శిక్షణ సర్టిఫికెట్లు పొందిన పల్నాడు వైద్యులతో జిల్లా వైద్యాధికారులు, డాక్టర్లు

నరసరావుపేట: సురక్షితంగా తల్లికి ఏవిధమైన ఆరోగ్య సమస్యలు రాకుండా గర్భస్రావం చేసేందుకు నైపుణ్యం, మెలకువలు అవసరమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి ఆదివారం తెలిపారు. పీహెచ్‌సీ వైద్యులకు మూడురోజుల శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. పన్నెండు వారాల లోపు గర్భం ఉన్న వారికి శిక్షణ తీసుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యాధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గర్భస్రావం చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పల్నాడుకు చెందిన పీహెచ్‌సీ వైద్యులకు గుంటూరు జీజీహెచ్‌లో కాంప్రహెన్సివ్ అబోర్షన్ కేర్(సీఏసీ)పై మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వటం పూర్తయిందని, ఇది మరో మూడు బ్యాచ్‌లకు ఈనెల 13వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేసినట్లు చెప్పారు.

పెరియార్ ఉద్యమం నేటికీ సజీవం

ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్

సత్తెనపల్లి: వంద సంవత్సరాల క్రితమే కుల వివక్షత, మనువాదం, బ్రాహ్మణ ఆధిపత్య వ్యతిరేక ఉద్యమాలకు ఊపిరి పోసిన పెరియార్ స్ఫూర్తి నేటి పరిస్థితులకు సజీవమని ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది చిలుకా చంద్రశేఖర్ అన్నారు. పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. సభకు కవి, పాత్రికేయుడు బి.విల్సన్ అధ్యక్షత వహించారు. చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత పాలనలో తిరిగి మనువాద ఆలోచనలు పురుడు పోసుకుంటున్నాయన్నారు.పెరియార్ స్ఫూర్తితో సంఘటితంగా దీన్ని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. మనువాదం నుంచి ప్రజాస్వామ్యవాదాన్ని బతికించుకోవాలన్నారు. మూఢ విశ్వాసాలపై సమరశంఖం పూరించిన వ్యక్తి పెరియార్ అన్నారు. పెరియార్ రీడర్ పుస్తకాన్ని తెలుగులో అనువదించామని దీనిని పాఠకులు చదవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. సీనియర్ న్యాయవాదులు సయ్యద్ అబ్దుల్ రహీం, బత్తిన శ్రీనివాసబాబు, వై వెంకటేశ్వరరావులు పెరియార్ జీవిత చరిత్ర గురించి వివరించారు. ప్రముఖ చిత్రకారుడు జింకా రామారావును సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గుంటూరు గోవిందు, గుంజి విజయ్‌కుమార్, సీనియర్ జర్నలిస్ట్ బండారు సురేష్‌బాబు, న్యాయవాది పూజల వెంకట కోటయ్య, దళిత సేవాదళ్ రాష్ట్ర నాయకులు తాళ్లూరి అమర్‌నాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాధంశెట్టి వేదాద్రి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్, జై భీమ్ పార్టీ నాయకులు జొన్నలగడ్డ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికలు


ఎంపికైన విద్యార్థులతో క్రీడా ఉపాధ్యాయులు

అచ్చంపేట: పల్నాడు జిల్లా అమెచ్యూర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపికలు ఆదివారం నిర్వహించారు. స్థానిక డాక్టర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఎంపికలకు వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపికలు అండర్–15 బాలుర, బాలికల విభాగాలలో వేర్వేరుగా నిర్వహించినట్లు అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం తెలిపారు. బాలుర విభాగంలో బి.ఓబేదు(కొండూరు), కె.గోపయ్య (అచ్చంపేట), ఎస్.ఉదయ్ కిరణ్(కొత్తపల్లి), ఎస్.బాబు (గోరంట్ల), వి.పృథ్వి (చౌటపాపాయపాలెం), వై.నవీన్ (చల్లగరిగ), ఎం.శివాజి (తాడువాయి), బి.రత్నబాబు(అత్తలూరు) తదితరులు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో డి నికిత(ముండాది), ఇ.లాస్య (రెంటపాళ్ల), ఎం.సంధ్యారాణి(గంగళకుంట), డి.గౌతమి (ముండాది), ఎ.సంధ్య(పిడుగురాళ్ల), బి.మోక్షవైష్ణవి(అచ్చంపేట), ఎం.కీర్తనాబాయ్(అచ్చంపేట) ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులంతా ఈనెల 13,14 తేదీలలో చిత్తూరు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలలో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం తెలిపారు. ఎంపికలను జిల్లా కోచ్ కె.మనోహర్, పీఈటీలు జయశ్రీ, బ్రహ్మయ్య పర్యవేక్షించారు.

'పవర్' చాటిన జ్ఞానదివ్య

తెనాలి: కేరళలోని అలెప్పీలో జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మరో తెనాలి తేజం మెరిసింది. జాతీయ పోటీల్లో తన 'పవర్'ను చాటిన రూరల్ మండలం కఠెవరానికి చెందిన నాగం జ్ఞాన దివ్య, ఆసియా పోటీల్లో పాల్గొని సబ్‌జూనియర్స్‌లో 84 ప్లస్ కేటగిరీలో నాలుగు రజత పతకాలు సాధించటం విశేషం. స్క్వాట్‌లో 180 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 80 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 150 కిలోల బరువులనెత్తి మూడింటిలోనూ రజత పతకాలు సాధించింది. మొత్తం 410 బరువులతో ఓవరాల్‌గా ద్వితీయస్థానంలో నిలిచి, మరో రజతాన్ని కైవసం చేసుకుంది. కఠెవరంలోని మాతృశ్రీ అకాడమీలో అకాడమీ కోచ్‌లు సోమిశెట్టి కోటేశ్వరరావు, ఏవీ రామిరెడ్డి, షేక్ సుభానీవలి, కొల్లిపర నాగశిరీష శిక్షణలో జ్ఞానదివ్య సాధన చేస్తోంది. గతేడాది ఆగస్టులో కేరళలోని కసర్‌ఘడ్‌లో జరిగిన జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో సబ్‌జూనియర్స్ విభాగంలో తలపడి స్క్వాడ్, డెడ్‌లిఫ్ట్‌లో అంతకుముందున్న రికార్డులు బ్రేక్‌చేసింది. ఆ రెండు విభాగాలతో పాటు ఓవరాల్‌గా మొత్తం మూడు బంగారు పతకాలను జ్ఞానదివ్య ఆ పోటీల్లో కైవసం చేసుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్, కామన్‌వెల్త్ పోటీల్లో పతకాలను సాధించాలనేది తన ఆకాంక్షగా చెప్పింది.